ఆధార్ లేదు.. పథకాలు అందవు


ఆధార్‌కార్డు లేని విద్యార్థులు

• గోస పడుతున్న విద్యార్థులు

కెరమెరి: ప్రస్తుత కాలంలో అన్నింటికీ ప్రభుత్వం ఆధార్‌కార్డు తప్పనిసరి చేసింది. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ఆధార్‌కార్డు అవసరం. అయితే మండలంలోని అనేక మంది విద్యార్థులకు ఆధార్‌కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో ప్రవేశం పొందేవేళ ఆధార్‌కార్డు తప్పనిసరి కావాలని ఉపాధ్యాయులు అడుగుతున్నారు. ఆధార్‌కార్డు లేకుండా అడ్మిషన్ పొందితే ప్రయోజనం లేకుండా పోతోంది. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, పీఎస్‌లు, కేజీబీవీలు మొత్తం 98 ఉన్నాయి. ఇందులో 5,173 మంది చదువుతుండగా 4,851 మంది విద్యార్థులు ఆధార్ కార్డులు కలిగి ఉన్నారు. 722 మందికి ఆధార్ కార్డు లేదు. గతంలో చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆధార్‌కార్డు పొందినప్పటికీ కార్డులు మాత్రం జారీ కాలేదు. ఇంకొందరు అసలు ఆధార్ కేంద్రాలకే వెళ్లలేదు. దీంతో విద్యార్థులు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందలేకపోతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకానికి నోచుకోలేకపోతున్నారు. మండలంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండంలలోని చాలామంది కార్డుల్లో సవరణలు చేసుకోవాల్సి ఉంది. ఇందుకోసం ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆరుమాసాలుగా ఆధార్‌కేంద్రం లేక విద్యార్థులు, ప్రజలు కష్టాలు పడుతున్నారు.

ప్రతి ఒక్కరికీ తప్పనిసరి



పాఠశాలలోని ప్రతి విద్యార్థికీ ఆధార్‌కార్డు అవసరం. ఆధార్ లేనిది అడ్మిషన్ కూడా చేయలేని పరిస్థితి. ఆధార్‌కార్డు లేని వారు సమీప ఆధార్ కేంద్రానికి వెళ్లి వివరాలు తెలిపి కార్డులు పొందాలి. ఇందుకు తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపాలి.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో

బారేమోడిలో బస్సులు ఆపాలి


డీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని బారేమోడిలో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సులు ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ, ఉపాధ్యక్షుడు సతీశ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బారేమోడి గ్రామ విద్యార్థులు జిల్లా కేంద్రానికి ఇంటర్, డిగ్రీ చదువుల కోసం వస్తున్నారని, కానీ.. బస్సులు నిలుపకపోవడంతో సమయానికి కాలేజీలకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్యలో వస్తున్న బస్సులు నిలుపడం లేదని పేర్కొన్నారు. అలాగే, ఆసిఫాబాద్ నుంచి కెరమెరి వరకు బస్సు నడపాలని కోరారు. విజ్ఞప్తిని పరిశీలించి త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. నాయకులు కార్తిక్, సంగీత, విద్యార్థులు నందిని, స్వప్న, పులవతి, మేనక, అనూష, సునీత తదితరులున్నారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి


మాట్లాడుతున్న విజయ్, ప్రభాకర్

కెరమెరి: ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70, పేసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, జిల్లా సలహాదారు కనక ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలను అధికారులు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. అనేక వినతిపత్రాలు అందించినప్పటికీ పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. ఫలితంగా అక్రమ భవన నిర్మాణాలు నానాటికి పెరుగుతున్నాయని తెలిపారు. చట్టాలను దుర్వినియోగం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్‌ను బదిలీ చేయాలి


వినతిపత్రం ఇస్తున్న చిన్న బెడార గ్రామస్తులు

వాంకిడి: విధులను నిర్లక్ష్యం చేస్తున్న చిన్న బెండార గ్రామ అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో ఏసీడీపీవో ఉమా ఫాతిమాకు వినతిపత్రం అందజేశారు. ఆరునెలల నుంచి పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టడంలేదని, సక్రమంగా విధులకు హాజరు కాకుండా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం లేదని ఆరోపించారు. వెంటనే ఆమెను బదిలీ చేయాలని కోరారు.

దోమతెరల పంపిణీ

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు వృద్ధులకు ఉచితంగా దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. దోమకాటుతో వ్యాధులు సోకుతాయని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు బండ శేఖర్, జుమిడి సాగర్, కుమురం నాగేశ్, రాంటెంకి నాగరాజ్, మున్నా, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను గోశాలకు తరలిస్తాం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రోడ్లపై సంచరిస్తూ.. వాహనదారులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న పశువులను గోశాలకు తరలిస్తామని పట్టణ సీఐ బాలాజీ వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించని పక్షంలో చర్యలు తప్పవన్నారు. రెండు రోజుల్లో పశువులను తమ ఇళ్లకు తీసుకుపోకుంటే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన 'అరిగెల'

ఆసిఫాబాద్‌అర్బన్: బీజేపీ రాష్ట్ర కమిటీ పూర్తిగా నియామకమైన సందర్భంగా బుధవారం పార్టీ సీనియర్ నాయకుడు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు.

రెబ్బెన ఎస్సైగా వెంకటకృష్ణ


వెంకటకృష్ణ

రెబ్బెన: రెబ్బెన ఎస్సైగా అప్పని వెంకటకృష్ణను నియమిస్తూ జోన్–1 ఇన్‌చార్జి డీఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్‌ను వీఆర్ కుమురంభీం జిల్లాకు బదిలీ చేశారు. గోదావరిఖని–1 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అటాచ్డ్ టూ వీఆర్ రామగుండం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణను రెబ్బెన ఎస్సైగా నియమించారు.

కుట్టుమిషన్ పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన ఆత్రం అరుణకు నిషా జోహ్రీ జగేంద్ర కుమార్ జోహ్రీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఎస్సై అనిల్‌కుమార్ కుట్టుమిషన్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలను ప్రోత్సహించేందుకు ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు దుర్గం రాజన్న, గడ్డం మహేశ్, రాజాగౌడ్, భుజంగరావు, తిరుమల్‌గౌడ్, సాజీద్, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీల వేతనాలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న కోవ విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్టీల వేతనాలు విడుదల చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని కెస్లాగూడలో బుధవారం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనే ఎక్కువ మంది సీఆర్టీలు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వారికి 6, 7 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. నాయకులు నాగోరావు, విశ్వేశ్వరరావు, వనస్పతి, యశ్వంత్‌రావు, దినేశ్, జంగు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు


నర్ధంగుడలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లింగాపూర్: ఒకవైపు ముసురు పడుతుండగా, మరో వైపు ఎండలు దంచికొడుతున్నాయి. వాతావరణ మార్పులతో గ్రామీణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. వైరల్, మలేరియా, టైఫాయిడ్ ప్రబలుతున్నాయి. లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొద్దిరోజులుగా జ్వర పీడితులే ఎక్కువగా వస్తున్నారు. జూన్, జూలైతో పోల్చితే ఆగస్టు చివరి వారం నుంచి రోగుల సంఖ్య రెట్టింపు కావడం జ్వరాల తీవ్రతను తెలుపుతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నా వారం, పది రోజుల వరకు జ్వరాల తగ్గడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

విషజ్వరాలు ప్రబలుతుండటంతో అప్రమత్తమైన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు గత నెల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్ రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఖర్చులపాలు కావొద్దని, ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స పొందాలని గ్రామీణులకు వైద్యాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం నద్దంగుడా గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఒకరికి డెంగీ నిర్ధారణ అయిందని, ఆమెకు మందులు అందజేసినట్లు వైద్యులు తెలిపారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

లింగాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై అధికారులు సామాజిక తనిఖీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. 2024 ఏప్రిల్ నుంచి మార్చి 2025 వరకు మండల పరిధిలో రూ.4.28కోట్ల విలువైన పనులు చేపట్టారు. ఇందులో చేపట్టిన పనులు, కూలీలకు చెల్లింపులు తదితర వివరాలు తెలుసుకునేందుకు తనిఖీ బృందం క్షేత్రస్థాయికి వెళ్లనుంది. అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జాబ్‌కార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకుంటారు. ఒక్కో గ్రామంలో ఒక్కో బృందం సర్వే చేయనుంది. దాదాపు 238 పనులపై సామాజిక బృందం ఆడిట్ చేయనున్నారు. గ్రామాల్లో సర్వే పూర్తి కాగా చివరిరోజు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలు నిర్వహిస్తారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ వివరాలను పూర్తి స్థాయిలో వెల్లడిస్తారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ప్రారంభోత్సవంలో ట్రాన్స్‌కో అధికారులు

వాంకిడి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ రాథోడ్ శేషగిరిరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ మార్గదర్శకాలతో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని ద్వారా వాంకిడి ప్రాంత వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. డివిజనల్ ఇంజినీర్ బండల వీరేశం, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ పంబల శ్రీనివాస్, ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్ కటం శరత్ చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని విజయవంతం చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకల కరపత్రం ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు నల్గొండ శ్రీరాములు, తూమోజు సురేశ్‌చారి, తిరుపతిచారి, చిలుకూరి మహేశ్, శ్రీరామ్‌ప్రసాద్, శ్రీరామోజు శ్రీనివాస్, వెంకటయ్య, సత్యం, రాజు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్య పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న శ్యాంనాయక్

రెబ్బెన: మండలంలోని తక్కళ్లపల్లి పోడు రైతుల సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ కోరారు. బుధవారం తక్కళ్లపల్లి రైతులతో కలిసి జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌ను కలిసి సమస్య వివరించారు. పోడు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరగా, స్పందించిన ఆయన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, నాయకులు ఎండీ నిజాం, గాజుల రవీందర్, చిరంజీవిగౌడ్, ఇందూరి మహేందర్, రైతులు సంగెం విలాస్, భీమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్ టౌన్: ప్రజాబంధు పాల్వాయి పురుషోత్తం రావు 26వ వర్ధంతి సందర్భంగా ఈనెల 15 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బుధవారం తెలిపారు. నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే జట్లు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి 13లోగా నిర్వాహకులకు అందించాలన్నారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ. 25 వేలు, మూడో బహుమతి రూ. 15 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న నాయకులు


నివాళులర్పిస్తున్న అధికారులు


నివాళులర్పిస్తున్న నాయకులు

తిర్యాణి: చాకలి ఐల్లమ్మను ఆదర్శంగా తీసుకోవాలని, రజకులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని రజక సంఘం మండలాధ్యక్షుడు బూసి సంతోష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాగళ్ల రాజమౌళి, దుర్శెట్టి సతీశ్, పున్నం కుమార్, నల్లూరి రాజు, కాల్వ మల్లేశ్ తదితరులున్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో ఖాజా అజీజుద్దీన్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. తొలి భూపోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పుకణిక అని కొనియాడారు. ఏపీవో శ్రావణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్: వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు దేవనపల్లి సత్తయ్య మాట్లాడుతూ.. చిట్యాల ఐలమ్మ చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణా వీరవనిత అని కొనియాడారు. కార్యక్రమంలో పొన్న వెంకటేశ్, పొన్న రాకేశ్, పొన్న కార్తీక్, దేవనపల్లి నవీన్, శ్రీరామ శేఖర్, ఇబ్రహీం, సొఖత్ఖాన్, తిరుపతి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ పోరాటాన్ని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కుశన రాజన్న, ఆనంద్‌కుమార్, సుదర్శన్, శంకర్, మల్లేశ్, రమేశ్, చంద్రన్న, తిరుపతి, అనిత పాల్గొన్నారు.


పూలమాల వేస్తున్న ఐక్య సంఘాల నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లోగల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఈనెల 22నుంచి అక్టోబర్ 2వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం ఆమె నివాసంలో ఆవిష్కరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్‌స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, సభ్యులు శ్రీకర్, రోహిత్ ఉన్నారు.

పులి అలజడి..!


మత్తడి వాగు ప్రాంతంలో రైతులు గుర్తించిన పాదముద్ర

బెజ్జూర్: బెజ్జూర్ రేంజ్ పరిధిలోని మత్తడివాగు ప్రాంతంలో మంగళవారం రాత్రి పెద్దపులి సంచరించినట్లు రైతులు తెలిపారు. కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో పులి అలజడి లేదు. ప్రస్తుతం మత్తడి ప్రాంతంలో పాదముద్రలు కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ విషయంపై బెజ్జూర్ ఎఫ్ఆర్‌వో ముసవీర్‌ను వివరణ కోరగా, రేంజ్ పరిధిలో పులిజాడ లేదని తెలిపారు. పాదముద్రలు పరిశీలిస్తే చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది క్షేత్రస్థాయికి పంపించి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు.

ఓటరు జాబితా విడుదల


ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

కౌటాల: కౌటాల మండల ఓటరు జాబితాను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాదేశిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను సవరించి విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాల్లో 27,357 ఓట్లు ఉన్నాయని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు తుది జాబితాను ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఏపీవో పూర్ణిమ, దీపక్, రాజ్‌కుమార్, కార్యదర్శులు సాయికృష్ణ, సురేశ్, ఆపరేటర్లు సంతోష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల తుది ఓటరు జాబితాతో పాటు, పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 5 ఎంపీటీసీ స్థానాలతో పాటు జెడ్పీటీసీ స్థానాలు, పోలింగ్ కేంద్రాలను ప్రచురించినట్లు పేర్కొన్నారు.

వాంకిడి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఫైనల్ ఓటరు జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీవో ఖాజా అజీజుద్దీన్ తెలిపారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నోటీస్ బోర్డు వద్ద ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఏపీవో శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

రెబ్బెన: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ పోస్టర్‌ను బుధవారం గోలేటిలోని సీహెచ్‌పీ వద్ద జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు ఓదెలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. 2012 నుంచి జీతాలు పెరగాల్సి ఉందని, జీవో నంబర్ 21, 22, 23, 24లను గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని హైకోర్టు ఇప్పటికి మూడుసార్లు ఆదేశాలు ఇచ్చిందన్నారు. వేతనాల పెంపుతో ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదని స్పష్టం చేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న వారి శ్రమను దోచుకోవడం సరికాదన్నారు. కోలిండియాలో కాంట్రాక్టు కార్మికులకు రోజుకు రూ.1,285 చెల్లిస్తుండగా సింగరేణిలో మాత్రం కేవలం రూ.541 చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజశేఖర్, గోపాల్, వెంకటేశ్, జాఫర్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు నరేందర్ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకుడు కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీగేట్ ఫిజిక్స్‌లో శంకర్‌కు 21వ ర్యాంకు


దుర్గం శంకర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దుర్గం శంకర్ సీపీగేట్ ఫిజిక్స్‌లో రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంకు సాధించారు. రెబ్బెన మండలం నారాయణపూర్ వ్యవసాయ కుటుంబానికి చెందిన శంకర్‌ను బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు పర్వా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.